416) నాదనామక్రియ

ప॥ నే నేమెరిగి సేసేనో నీకు దిరువారాధన। అని మున్నిటిబ్రహ్మరుద్రాదులు సేయగలేరు॥

చ॥ అనుగునీరూప మింతింతనెరిగి సేసేనో। వునికై నీ వొక్కచోనే వుండే దెరిగి సేసేనో।
తనిసి నీకు నొక్కమంత్రమనెరిగి సేసేనో। కనరానినీమహిమే కడయెరిగి సేసేనో॥

చ॥ మరిగి నీకు నొక్కనామమనెరిగి సేసేనో। అరిసి యించుకేకాలమనెరిగి సేసేనో।
నిరతి నీ కేమి లేవని యెరిగి సేసేనో। బెరసి నన్ను గొంత మెప్పించ నెరిగి సేసేనో॥

చ॥ తెలిసి నీకు నొక్కమూర్తియనెఱిగి సేసేనో। అలమిననీమాయ గొంతనెఱిగి సేసేనో।
అలమేల్మంగకు బతియగుశ్రీవేంకటేశుడ। వొలిసి నీ కుపమింప నొక్కటెరిగి సేసేనో॥